సాక్షి
వికారాబాద్

శుక్రవారం । 15 । డిసెంబర్ । 2023



నిర్లక్ష్యపు నీడలో..

కొడంగల్ మున్సిపల్ పరిధిలో పలుచోట్ల అధికారులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. 10లో▸



నేడు ఆటల పోటీలు

దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి లలితకుమారి తెలిపారు. 10లో▸



దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన వారు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ. శ్రీపతిరెడ్డి తెలిపారు. 11 లో▸

న్యూస్‌రీల్

మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

తాండూరు టౌన్: తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి గురువారం రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

తూకంలో మోసాలకు పాల్పడితే చర్యలు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్



పత్తి రైతులతో మాట్లాడుతున్న జిల్లా అధికారి గోపాల్

పరిగి: పత్తి కొనుగోలులో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్ హెచ్చరించారు. గురువారం మండలంలోని రంగంపల్లి పత్తి మిల్లును సందర్శించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పత్తి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంట దిగుబడి కొనుగోలు చేయాలని సూచించారు. మిల్లుల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పత్తి పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు కాకుంటే రైతులు వ్యవసాయ విస్తరణ అధికారి, ఆర్‌ఐ ద్వారా ధ్రువీకరణ పత్రం తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ఓటర్లను గుర్తించండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

దౌల్తాబాద్: గ్రామాల్లో అర్హులైన ఓటర్లను గుర్తించడంలో బీఎల్‌ఓలు జాగ్రత్త వహించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మృతి చెందిన వారిని, డబుల్ ఎంట్రీలను గుర్తించి తొలగించాలని ఆదేశించారు. జనవరి 1, 2024వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువత కొత్త ఓటర్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

కేంద్ర ఐటీ శాఖ మంత్రిని కోరిన మారుతికిరణ్



కేంద్ర మంత్రితో మాట్లాడుతున్న మారుతికిరణ్

పరిగి: తెలంగాణ రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ కేంద్ర ఐటీ శాఖ మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్‌ను కోరారు. గురువారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మారుతి కిరణ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో చాలా మంది నిరుద్యోగులు ఉన్నారని, వారికి స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇస్తే వారు వివిధ రంగాల్లో రాణించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు.



కరివేనా సమీపంలో కృష్ణా నదిపై నిర్మించిన పాలమూరు ఎత్తిపోతల పథకం

దశ మారేనా?

అనాదిగా వెనుకబాటుకు గురవుతున్న జిల్లా

- సర్వే ప్రక్రియ దాటని వికారాబాద్ – మక్తల్ రైల్వే లైన్
- హామీలకే పరిమితమైన అనంతగిరి టూరిజం అభివృద్ధి
- దశాబ్దాలు గడుస్తున్నా జిల్లాను తాకని 'పాలమూరు' నీళ్లు
- జిల్లావాసి సీఎం కావడంతో చిగురిస్తున్న ఆశలు

వికారాబాద్: రేవంత్‌రెడ్డి సీఎం పీఠాన్ని అధిష్టించింది మొదలు జిల్లా అభివృద్ధిపై ప్రజల ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు ఆనుకొని ఉన్న వికారాబాద్ జిల్లా పరిస్థితి దీపం కింద చీకటి అన్న చందంగా తయారయ్యింది. అనాదిగా వెనుకబాటుకు గురవుతూనే వస్తోంది. జిల్లాలో అన్ని వనరులు అందుబాటులో ఉన్నా వినియోగించుకోవడంలో పాలకులు విఫలమవుతూ వస్తున్నారు. జిల్లా ప్రజలు ఈ ప్రాంత అభివృద్ధిపై పెట్టుకున్న ఆశలు, ఆకాంక్షలు బుట్టదాఖలవుతూనే వస్తున్నాయి. అభివృద్ధి పనుల్లో చాలా వరకు ఎన్నికల హామీలకే పరిమితమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఇక్కడి ప్రజల్లో అభివృద్ధిపై ఆశలు చిగురించాయి.

పెండింగ్‌లో 'పాలమూరు'

పెద్ద ప్రాజెక్టులు చేపట్టి పూర్తి చేస్తే జిల్లా రూపురేఖలు మారుతాయని ప్రజలు ఆశ పెట్టుకున్నా ఏ ప్రాజెక్టు కూడా కార్యరూపం దాల్చడంలేదు. ప్రధానంగా రంగారెడ్డి – పాలమూరు ఎత్తిపోతల పథకం ఎన్నికల హామీగా మారిపోయింది. పార్టీ ఏదైనా ప్రతి ఎన్నికల్లో ఈ ప్రాజెక్టు పూర్తిచేసి జిల్లాలో ఐదు లక్షల పైచిలుకు ఎకరాలకు నీరందిస్తామని చెబుతూ వస్తున్నారు. కానీ ప్రాజెక్టును పూర్తి చేయడం లేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేసి జిల్లాకు నీరందించాలని సంకల్పించారు.



అనంతగిరి అటవీ ప్రాంతం

అయితే ప్రత్యేక రాష్ట్రం రావడం, బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు డిజైన్‌ను మార్చారు. తరువాత పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి జిల్లాకు నీరందిస్తామని చెబుతూ వచ్చిన ఆ ప్రభుత్వం పదేళ్లు గడిచినా ఆ హామీని నెరవేర్చలేదు. ప్రాజెక్టు పూర్తయ్యిందని చెబుతున్నా ఇప్పటి వరకు జిల్లాలో కనీసం కాలువల కోసం భూ సేకరణ కూడా పూర్తి చేయలేదు.

కలగానే అనేక ప్రాజెక్టులు

జిల్లాకు సంబంధించి అనేక ప్రాజెక్టులు, పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్ – మక్తల్ రైల్వే లైన్ ప్రతిపాదన దశాబ్దాల కాలంగా కలగానే ఉండిపోయింది. గతంలో పలు సార్లు సర్వేలు చేసినా పనులు ప్రారంభం కాలేదు. ఈ ప్రాజెక్టు పూర్తయితే పరిగి, దోమ, కుల్కచర్ల, బొంరాస్‌పేట, గండేడ్, కొడంగల్ తదితర మండలాల ప్రజలకు రైలు ప్రయాణం అందుబాటులోకి వస్తుంది. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు ప్రకటనలకే పరిమితమైంది. హార్టికల్చర్ యూనివర్సిటీ, పాలిటెక్నిక్ కళాశాలలు, గిరిజన డిగ్రీ కళాశాలలు ఏర్పాటు పాలకులకు పట్టడం లేదు. తాండూరు నియోజకవర్గంలో ఉన్న నాపరాతి గనులు అనేక మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. అయితే వీటికి సంబంధించి రాయల్టీ ఫీజు తగ్గించాలని ఆ ప్రాంత ప్రజలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు. కానీ ఫలితం లేకుండా పోయింది. అనంతగిరిని టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న డిమాండ్ నెరవేరడం లేదు. పరిగి – షాద్‌నగర్ మార్గంలో రద్దీ భారీగా పెరగడంతో విస్తరించాలనే డిమాండ్ ఉంది. ఆ పనులు కూడా కార్యరూపం దాల్చలేదు. వికారాబాద్, తాండూరు పట్టణాలకు రింగ్ రోడ్లు నిర్మించాలనే డిమాండ్ కూడా కలగానే మిగిలిపోయాయి. జిల్లా వాసి సీఎం అయిన నేపథ్యంలో ఈ పనులన్నీ పూర్తవుతాయని ఇక్కడి ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

అంచలంచెలుగా..

పాల ఎల్లమ్మ కొడుకు అసెంబ్లీ స్పీకరయ్యాడు



- తెలంగాణ సభాపతిగా గడ్డం ప్రసాద్‌కుమార్ బాధ్యతల స్వీకరణ
- తాండూరు మండలం బెల్కటూర్ స్వగ్రామం
- ఎంపీటీసీ నుంచి రాజకీయ ప్రస్థానం

తాండూరు: తెలంగాణ స్పీకర్‌గా మాజీ మంత్రి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తాండూరు మండలం బెల్కటూర్‌కు చెందిన ప్రసాద్‌కుమార్ తాండూరు పట్టణంలో స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. వ్యవసాయమే వృత్తిగా వీరి కుటుంబం జీవనం సాగించింది. తల్లి ఎల్లమ్మ పాల వ్యాపారం చేసేవారు. పట్టణంలోని కుమ్మర్‌గల్లి ప్రాంతానికి చెందిన పాల ఎల్లమ్మ అంటే తెలియని వారుండరు. ప్రసాద్‌కుమార్ తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ వచ్చారు. 1982లో కాంగ్రెస్ పార్టీ నుంచి తాండూరు మున్సిపల్ కౌన్సిలర్‌గా పాల ఎల్లమ్మకు పోటీ చేసే అవకాశాన్ని నాటి మంత్రి చందుమహరాజ్ కల్పించారు. ఆ ఎన్నికల్లో ఆమె స్వల్ప తేడాతో ఓటమి చెందారు. ప్రసాద్‌కుమార్ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యాభ్యాసం సాగించారు. ఆయనకు ఏడుగురు సోదరీమణులు ఉన్నారు. తండ్రి మరణంతో విద్యార్థి దశలోనే కుటుంబ బాధ్యతలు ప్రసాద్‌కుమార్‌పై పడ్డాయి. దీంతో చదువుకు స్వస్తి పలికారు. సోదరి చేయూతతో హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ ప్రాంతంలో ఓ ప్రింటింగ్ ప్రెస్ ప్రారంభించారు.

అలా రాజకీయ ప్రస్థానం..

కొంతకాలం పాటు ప్రింటింగ్ ప్రెస్ నడిపించిన ప్రసాద్‌కుమార్ తర్వాత తల్లి రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొన్నారు. ఎంపీటీసీ సభ్యుడిగా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టారు. అనంతరం మర్పల్లి ఎంపీపీగా కొనసాగారు. ఈ క్రమంలో వైఎస్సార్ హయాంలో వికారాబాద్ నియోజకవర్గానికి మధ్యంతర ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను గడ్డం ప్రసాద్‌కుమార్‌కు కేటాయించారు. ఈ ఎన్నికల్లో ఆయన ఎమ్మెల్యేగా తొలిసారి విజయం సాధించారు. తర్వాత రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం శాసనసభలో స్పీకర్‌గా అవకాశం దక్కించుకున్నారు. దీంతో ఇటు తాండూరు, అటు వికారాబాద్‌లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

పలువురి శుభాకాంక్షలు

షాద్‌నగర్: అసెంబ్లీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన గడ్డం ప్రసాద్ కుమార్‌కు గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీలో స్పీకర్‌గా ఎన్నికైన అనంతరం ఆయనను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వివాదరహితుడు, అందరు మెచ్చిన నేత ప్రసాద్‌కుమార్ ఎన్నిక అభినందనీయమన్నారు.



మన్‌సాన్‌పల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- తూకంలో తేడా ఉంటే చర్యలు
- ఆర్డీఓ శ్రీనివాసరావు


పెద్దేముల్: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాస్‌రావు సూచించారు. గురువారం మండలంలోని మన్‌సాన్‌పల్లి, మంబాపూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రైతులతో మాట్లాడి బార్‌దాన్ సంచులు అందజేశారా.. తూకంలో ఏదైనా మోసం ఉందా.. అధికారులు ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా అని ఆరా తీశారు. మండలంలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఉన్నాయి.. ఇప్పటి వరకు ఎంత మంది రైతుల నుంచి ఎంత మేర ధాన్యం కొనుగోలు చేశారని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జ్ నజీర్‌ను అడిగారు. మన్‌సాన్‌పల్లి, మంబాపూర్, జనగాం కేంద్రాల్లో ఇప్పటి వరకు 743 బస్తాలు, 297 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ.. ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతులకు వసతులు కల్పించాలని ఆదేశించారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కొంత మంది రైతులు ధాన్యం తెస్తామని గన్నీ బ్యాగులు తీసుకెళ్లి ప్రైవేట్ వారికి విక్రయిస్తున్నారని, దీంతో సమస్యలు వస్తున్నట్లు ఆర్డీఓ దృష్టికి తెచ్చారు. ఇకపై రైతుల పూర్తి వివరాలు తీసుకున్న తరువాతే గన్నీ బ్యాగులు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేయొద్దు: డీసీఎంఎస్ మేనేజర్ శ్యాంసుందర్‌రెడ్డి

తాండూరు రూరల్: వరి ధాన్యం కొనుగోలులో రైతులను మోసం చేయరాదని తాండూరు డీసీఎంఎస్ మేనేజర్ శ్యాంసుందర్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. తాండూరు మండలం గోనూర్ కొనుగోలు కేంద్రాంలో 42 కిలోలకు 200 గ్రాములు ధన్యాన్ని అదనంగా తీసుకుంటున్నట్లు రైతులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. వెంటనే సిబ్బందితో మాట్లాడి 41కిలోలు తూకాం వేయాలని ఆదేశించినట్లు ఆయన చెప్పారు. రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం విక్రయించి మోసపోరాదని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు.

'ఫార్మా' రద్దు సరికాదు

- రైతులకు భూములు వాపసు చేయాలి
- న్యాయం చేయకపోతే ఉద్యమిస్తాం
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం: ఫార్మాసిటీని రద్దు చేస్తే ఆ భూములను తిరిగి రైతులకు ఇచ్చేయాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఫార్మా కోసం భూములను పరిశీలించి ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసిందని గుర్తు చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఫార్మాకు అనుమతి ఇవ్వడంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూసేకరణ చేపట్టి రైతులకు సుమారు రూ.600 కోట్లకు పైగా నష్టపరిహారం చెల్లించిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫార్మాను రద్దు చేసి ఆభూముల్లో హౌసింగ్‌బోర్డు, టౌన్‌షిప్, మెట్రోసిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రియల్ వ్యాపారం చేసుకునేందుకు ఫార్మాను రద్దు చేస్తే సహించేదిలేదన్నారు. రైతులకు భూములు వాపసు చేయకుంటే.. వారికి న్యాయం జరిగేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎంతోమంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కకుండా కొత్త ప్రభుత్వం దూరం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత ప్రభుత్వం ఇచ్చిన అభివృద్ధి పనుల ప్రొసీడింగ్స్‌ను రద్దు చేస్తామనడం సరికాదన్నారు. ఇది కక్ష సాధింపు చర్య అవుతుందన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే..

రాజకీయాల్లో ఉన్నా

- ఇకపై ఫుల్ టైమ్ తాండూరుకు కేటాయిస్తా
- రానున్న వరుస ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తా
- మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు: తాండూరు ప్రజల ఆశీర్వాదంతోనే మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంటూ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఆయన నివాసంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్, నాయకులతో కలిసి మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం వల్లే నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా, రెండు సార్లు ఎమ్మెల్సీగా అవకాశం వచ్చిందన్నారు. అలాంటి ప్రజలను ఎలా వదులుకుంటామని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలని ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి వచ్చిందని, అయితే పార్టీ నిర్ణయం మేరకే పోటీ చేయలేదన్నారు. మరో నాలుగేళ్ల పాటు ఎమ్మెల్సీగా ఉంటానని, అప్పటి వరకు తాండూరుకు ఫుల్ టైమ్ కేటాయిస్తానన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంత అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు తెచ్చినట్లు తెలిపారు. తాండూరులో పార్టీని నడిపించే బాధ్యత ఎమ్మెల్సీగా తనకే ఉంటుందన్నారు. అందులో ఎలాంటి సందేహం లేదన్నారు. రాబోయే వరుస ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కొడంగల్‌ను నరేందర్‌రెడ్డి అభివృద్ధి చేసినట్లు ఎవరూ చేయలేదన్నారు. ఈ నెల 17న పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో తాను నిర్వహించే పడిపూజ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున రావాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రామకృష్ణ, బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ టీకాలు ఇప్పించాలి

- రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డా. వెంకటేశ్వర్ రావు

తుర్కయంజాల్: పిల్లలందరికీ తప్పనిసరిగా టీకాలు ఇప్పించాలని జిల్లా వైద్యాధికారి డా. వెంకటేశ్వర్ రావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించేలా చైతన్య పరచాలని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డా. ఎం.ఎ.అజహర్ మాట్లాడుతూ.. వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది టీకాల కార్యక్రమంలో పాటించాల్సిన సాంకేతిక విధానాలు, ఆధునిక పద్ధతులు, పిల్లల్లో వ్యాధులను గుర్తించే పరిజ్ఞానాన్ని వివరించారు. చిన్న పిల్లల్లో వచ్చే ఆకస్మిక జ్వరం, అస్వస్థత, శరీర భాగాల్లో కదలికలు లేకపోవడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే వైద్య సహాయం అందేలా చర్యలు చేపట్టాలని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పిల్లలకు టీకాలు వేయించడం ద్వారా వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా టీకాల అధికారి డా.స్వర్ణ కుమారి, అన్ని డివిజన్ల డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత తప్పనిసరి



విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న డీటీడీఓ కోటాజీ

- వంద రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- డీటీడీఓ కోటాజీ

బొంరాస్‌పేట: పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత తప్పనిసరి అని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కోటాజీ అన్నారు. గురువారం మండలంలోని బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల ప్రగతి, బోధనా సామర్థ్యాలను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ రూపొందించిన వంద రోజుల కార్యక్రమాన్ని జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఉన్నత పాఠశాలల సిబ్బంది విజయవంతం చేయాలని ఆదేశించారు. నవంబరు ఒకటి నుంచి మార్చి వరకు అమలు చేసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం 6నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5నుంచి ఏడు గంటల వరకు, రాత్రి 9నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ సారి విద్యార్థులకు పరీక్ష సామగ్రి ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. పాఠశాలలోని 67మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని, అందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విక్రమ్‌సింగ్, వార్డెన్ రాజన్న, ఉపాధ్యాయులు శరణప్ప, సురేశ్‌కుమార్, సులోచన, రేణుకాదేవి, అనురాధ, ప్రసన్నకుమారి, అన్నపూర్ణ, జగదీశ్వరి, సంగీత, సుజాత, అనుశ్రీ, పీడీ నవనీత పాల్గొన్నారు.

క్లుప్తంగా

17న రన్నింగ్ సెలక్షన్స్

తాండూరు టౌన్: ఈనెల 17న తాండూరులో క్రాస్ కంట్రీ పరుగు పందెం సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధు, కార్యదర్శి రాములు గురువారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అండర్–16 బాలబాలికలకు 2 కిలోమీటర్లు, అండర్–18 వారికి 6 కిలోమీటర్లు, అండర్–20 వారికి 8 కిలోమీటర్లు, ఆపై వయసు గల మహిళలు, పురుషులకు 10 కిలోమీటర్ల క్రాస్‌కంట్రీ పరుగుపందెంలో పోటీలు నిర్వహిస్తారన్నారు. క్రీడాకారులు తహసీల్దార్‌చే జారీ చేయబడిన జనన ధృవీకరణ పత్రాన్ని వెంట తీసుకుని, ఈనెల 17న ఉదయం 9 గంటల్లోపు తాండూరు పట్టణంలోని పాత శాలివాహన మైదానానికి రావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23న జరుగనున్న 9వ రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పరుగుపందెం పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 89782 34447, 63000 75229 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆకతాయిల భరతం పడతాం

ఎస్ఐ భరత్‌భూషణ్



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ భరత్ భూషణ్

నవాబుపేట: ఆకతాయిలు వేధిస్తే సమాచారం ఇవ్వండి వారి భరతం పడతామని నవాబుపేట ఎస్ఐ భరత్‌భూషణ్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం బాల్య వివాహాలు, ఈవ్‌టీజింగ్, బాలల వేధింపులు తదితర వాటిపై కళాబృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్య వివాహాలను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆడపిల్లలను వేధింపులకు గురిచేసే ఆకతాయిలపై సమాచారం ఇస్తే వారి భరతం పడతామన్నారు. వారి రక్షణ విషయంలో అండగా ఉంటామన్నారు. ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యసిద్ధార్థిణి, కళాబృందం సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.6.75లక్షలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి సమీపంలోని శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయం కార్తీక మాసం నెలరోజులకు సంబంధించిన హుండీని గురువారం ఆలయం ఆవరణలో లెక్కించారు. రూ.6,75,119 ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ నరేందర్ తెలిపారు. హుండీని భక్తులు, పోలీసులు, దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో లెక్కించారు. ఆలయ ధర్మకర్త పద్మనాభం, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా..

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

పరిగి: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రంగాపూర్ సమీపంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి రంగాపూర్ గేట్ సమీపం నుంచి స్టీల్ ఫ్యాక్టరీ వైపు నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని వెనుకనుంచి వచ్చిన ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి ఎగిరి రోడ్డుపై పడగా అతని బాడీపై నుంచి వెనుకనుంచి వస్తున్న లారీ వెళ్లడంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. బాడీ పూర్తిగా గుర్తుపట్టలేని స్థితిలో ఉంది. పోలీసులు మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నర్సరీలకు లైసెన్స్‌లు తప్పనిసరి



సందర్శించిన జిల్లా అధికారి చక్రపాణి

అనంతగిరి: ప్రతిఒక్కరూ లైసెన్స్ తీసుకుని మొక్కల కొనుగోళ్లు, అమ్మకాలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి చక్రపాణి తెలిపారు. ఈమేరకు ఆయన వికారాబాద్ ప్రాంతంలోని పలు నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 12 ఏళ్ల క్రితమే ప్రభుత్వం చట్టాన్ని తీసుకొచ్చిందని, రైతులు ఇప్పటికి లైసెన్స్‌లు తీసుకోకపోవడం సరికాదన్నారు. రైతులకు నాణ్యమైన మొక్కలు అందాలనే ఉద్దేశంతోనే ప్రతిఒక్కరూ లైసెన్స్‌లు తీసుకోవాలని సూచిస్తున్నామని తెలిపారు.

నిర్లక్ష్యపు నీడలో నిఘా నేత్రం

- పనిచేయని సీసీ కెమెరాలు
- నిందితుల గుర్తింపులో తీవ్ర జాప్యం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



శివాజీ చౌక్‌లో పనిచేయని కెమెరా



అంబేడ్కర్ చౌరస్తాలో సీసీ కెమెరాలు

కొడంగల్: కొడంగల్ మున్సిపల్ పరిధిలో పలుచోట్ల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో ప్రమాదాలు.. చోరీలు జరిగిన కేసుల విషయంలో నిందితుల గుర్తింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు గతంలో దాతల సహకారంతో కొడంగల్‌తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశారు. మండల పరిధిలోని మేజర్ గ్రామాల్లో కూడా సీసీ కెమెరాలను బిగించారు. గ్రామ పోలీస్ అధికారులను నియమించి శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే సీసీ కెమెరాల ఏర్పాటు తప్పిస్తే వాటి నిర్వహణ గురించి పట్టించుకోకపోవడంతో వాటిలో మెజార్టీ కెమెరాలు ప్రస్తుతం పనిచేయడం లేదు.

కొడంగల్‌లో ...

మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా, బస్టాండ్ ఆవరణ, జాతీయ రహదారి, వినాయక చౌరస్తా, రషీద్ పాన్‌షాపు, గాంధీనగర్, బాలాజీనగర్, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల, హైవే పోలీస్ స్టేషన్, కొడంగల్ పోలీస్ స్టేషన్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాల దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే కొన్ని ప్రధాన ప్రాంతాల్లో మాత్రమే ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని బొంరాస్‌పేట, దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై తుంకిమెట్ల, నాగిరెడ్డిపల్లి, రేగడి మైలారం, రావులపల్లి, చంద్రకల్ గ్రామాల దగ్గర సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. తెలంగాణ కర్నాటక సరిహద్దు గ్రామాల దగ్గర సీసీ కెమెరాలు లేవు. మహబూబ్‌నగర్–తాండూరు రోడ్డుపై సీసీ కెమెరాలు లేకపోవడంతో ప్రమాదాలు జరిగితే గుర్తించడం కష్టంగా మారింది. కొడంగల్‌లో 50కు పైగా కెమెరాలు ఉండగా అందులో నాలుగు మాత్రమే పనిచేస్తున్నట్లు సమాచారం. బొంరాస్‌పేట మండలంలో 8 కెమెరాలు ఉండగా ఒకటి మాత్రమే పనిచేస్తోంది. దౌల్తాబాద్‌లో 8 కెమెరాలు ఉండగా రెండు తప్ప మిగతావి పనిచేయడం లేదు.

పశువుల దొంగతనాలు...

నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దొంగలు పశువులను అపహరిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లుగా పశువుల దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. ఇంటిముందు ఉన్న పశువులు కనిపించకపోయేసరికి రైతులు ఆందోళన చెందుతున్నారు. కొడంగల్ మండల పరిధిలోని రుద్రారం, చిట్లపల్లి, హస్నాబాద్ గ్రామాలతో పాటు దౌల్తాబాద్, బొంరాస్‌పేటలో పశువుల దొంగతనాలు జరిగాయి. లక్షల విలువ చేసే ఎద్దులు, ఆవులు, గేదెలు, మేకలను అపహరిస్తున్నారు. దొంగలు పశువులను వాహనాల్లో తీసుకెళ్లి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. వెంటనే సీసీ కెమెరాల మరమ్మతులు చేయించడంతో పాటు అవసరమైన చోట నూతన కెమెరాలు బిగించాలని.. అలాగే పోలీసు సిబ్బంది రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేస్తాం



నేను బాధ్యతలు తీసుకోక ముందు సీసీ కెమెరాలు అమర్చారు. వాటిలో కొన్ని సాంకేతిక సమస్యల వల్ల పనిచేయడం లేదు. త్వరలో వాటి మరమ్మతులు చేయిస్తాం. గ్రామాల్లో కూడా పనిచేయని వాటి స్థానంలో కొత్తవాటిని బిగించడానికి దాతల సహకారం కోరుతాం. నియోజకవర్గంలో దొంగతనాలను అరికట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఇబ్బంది కలిగే పరిస్థితి లేదు. శాంతిభద్రతలు పూర్తిగా అదుపులో ఉన్నాయి.

– రాములు, సీఐ, కొడంగల్

నేడు దివ్యాంగులకు ఆటల పోటీలు

జిల్లా శిశు సంక్షేమ, దివ్యాంగుల శాఖ అధికారిణి లలితకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న లలితకుమారి

వికారాబాద్ అర్బన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్ జిల్లాలోని దివ్యాంగులకు నిర్వహించబోయే ఆటల పోటీలను విజయవంతం చేయాలని జిల్లా శిశు సంక్షేమ దివ్యాంగుల శాఖ అధికారిణి లలితకుమారి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా దివ్యాంగుల అసోసియేషన్ సభ్యులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. శుక్రవారం నిర్వహించే దివ్యాంగుల క్రీడా మహోత్సవానికి కలెక్టర్ హాజరవుతున్నట్లు తెలిపారు. 10 నుంచి 16 సంవత్సరాల వారికి జూనియర్స్ విభాగంలో, 17 నుంచి 30 సంవత్సరాలు ఉన్నవారికి సీనియర్స్ విభాగాల్లో ఆటల పోటీలు ఉంటాయన్నారు. జిల్లాలోని దివ్యాంగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల్లోపు బ్లాక్ గ్రౌండ్లో హాజరై పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ అడిషనల్ పీడీ నర్సింహులు ఎంపీఆర్డీ జిల్లా అధ్యక్షుడు దశరథ్, ఉపాధ్యక్షుడు మురహరి, భారతీయ దివ్యాంగుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించండి



వీర్లపల్లి శంకర్‌తో టీఎస్ యూటీఎఫ్ నాయకులు

టీఎస్ యూటీఎఫ్

షాద్‌నగర్ రూరల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్ప డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ను టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం వెంకటప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా తరగతిగదులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరుగుదొడ్లు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. పాఠశాలలకు కేటాయించిన విద్యుత్ మీటర్లు వాణిజ్య మీటర్లు కావడంతో.. విద్యుత్ బిల్లులు రూ.వేలల్లో వస్తున్నాయని, వాటిని కట్టలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై వీర్లపల్లి శంకర్ సానుకూలంగా స్పందించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు వెంకటయ్య, శివారెడ్డి, నర్సింహులు, నాయకులు కృష్ణయ్య, సమత, శేఖర్‌గౌడ్, కృష్ణ, బాలయ్య, చంద్రశేఖర్, సత్యం, ప్రేమ్‌సాగర్, సురేందర్, రాములు, జ్ఞానేశ్వర్, రమేష్, రాజ్‌కుమార్, రంగరాజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షలపై దృష్టి సారించండి

ఎంఈఓ హరిశ్చందర్



సమావేశంలో మాట్లాడుతున్న హరిశ్చందర్

పరిగి: పదోతరగతి వార్షిక పరీక్షలపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. గురువారం పట్టణ కేంద్రంలోని నంబర్–1 పాఠశాలలో ఐదు మండలాల స్కూల్ అసిస్టెంట్ కాంప్లెక్స్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిని దృష్టిలో పెట్టుకుని బోధించాలని సూచించారు. గతేడాది ఫలితాల్లో వెనుకబడ్డామని.. ఈసారి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించి గ్రూపులవారీగా విభజించి బోధన చెప్పాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దోమ, పరిగి, కుల్కచర్ల, చౌడాపూర్, పూడూర్ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

ఆర్డీఓ శ్రీనివాసరావు

తాండూరు టౌన్: అర్హులైన యువతీయువకులు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని తాండూరు ఆర్డీఓ శ్రీనివాసరావు సూచించారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీయువకులు ఓటుహక్కు కోసం ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్ లేదా ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, మీసేవ ద్వారా అప్లై చేసుకోవాలన్నారు. ఈనెల 20వ తేదీ నుంచి జనవరి 5వ తేదీ వరకు ఈ దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. అలాగే ఓటరు కార్డులో మార్పులు, చేర్పుల కోసం ఫారం–8, మృతి చెందిన, డబుల్ ఓటర్లు, శాశ్వత వలస ఓటర్ల తొలగింపు కోసం ఫారం–7లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటుహక్కు దరఖాస్తుపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు తారాసింగ్, మునీరుద్దీన్, వెంకటస్వామి, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, రెవెన్యూ సిబ్బంది, పలు పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త సొబగులు

- ఆదిబట్ల ఐటీహబ్ రహదారికి మోక్షం
- ఔటర్ నుంచి పునరుద్ధరణ పనులు షురూ
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల ఐటీహబ్ రోడ్డుకు మోక్షం లభించింది. యేండ్ల తరబడి ఈ రోడ్డును వెడల్పు చేయకపోవడంతో ఇటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఆరోడ్డు పనులు పూర్తికానుండటంతో ఆదిబట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు పది సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న ఈ పనులు ప్రస్తుతం చకచకా కొనసాగుతున్నాయి. ఆదిబట్ల నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు ఉండే రోడ్డు సింగిల్‌గా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం ఈ ఇబ్బందులకు చెక్ పెడనుంది. టీఎస్ఐఐసీ అధికారులు ఈ రోడ్డు పునరుద్ధరణ పనులను త్వరలో పూర్తిచేయనున్నారు.

ఔటర్ వరకు రోడ్డు వేయాల్సి ఉన్నా..

టీసీఎస్ ఏర్పడినప్పటి నుంచి ఆదిబట్ల ఏరోస్పేస్ నుంచి ఆదిబట్ల మీదుగా బొంగ్లూర్ ఔటర్ రింగ్‌రోడ్డు వరకు డబుల్ రోడ్డు వేయాల్సి ఉంది. అయితే ఆదిబట్ల టౌన్ వరకు మాత్రమే వేశారు. ఆదిబట్ల టౌన్ నుంచి ఆదిబట్ల పోలీస్ స్టేషన్‌కు కొద్దిదూరం వరకే రోడ్డు పూర్తిగా వేశారు. అక్కడ నుంచి భూ సమస్య కారణంగా రోడ్డును నిలిపివేశారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందే రోడ్డు కోసం రైతులు భూములు ఇచ్చినప్పటికి టీఎస్ఐఐసీ అధికారులు రోడ్డును పూర్తిచేయకుండా వదిలేశారు. ప్రస్తుతం ఆ పనులు 60శాతం వరకు పూర్తిచేశారు.

రూ.3కోట్లతో రికార్పెటింగ్...

ఆదిబట్ల ఏరోస్పేస్ నుంచి ఔటర్ రింగ్‌రోడ్డు వరకు టీఎస్ఐఐసీ అధికారులు రోడ్డు వేస్తున్నారు. రూ.3 కోట్లు వెచ్చించి పోలీస్‌స్టేషన్ సమీపంలో మిగిలిపోయిన 300 మీటర్ల రోడ్డు వేశారు. అలాగే సెజ్ వరకు రికార్పెటింగ్ లేయర్ వేయనున్నారు. గతంలో గుంతలమయంగా మారిన ఈ రోడ్డు గుంతలు పూడ్చివేతతో పాటు వెడల్పు చేయనుండటంతో ఐటీ హబ్‌కు కొత్త హంగులు రానున్నాయి. నిరంతరం వేలాది సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండంతో రోడ్డు దెబ్బతిన్నాయి. వారం రోజుల్లో పనులు పూర్తి చేయనున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. పనులు పూర్తి అయితే ఆదిబట్ల పట్టణ ప్రజలతో పాటు ఐటీ ఉద్యోగులకు రాకపోకలు సులభతరం కానున్నాయి.

పనులు పూర్తిచేస్తాం



ఆదిబట్ల ఐటీ కారిడార్ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ఈ రోడ్డు పనులు పూర్తిచేయాలని ఎన్నికల ముందు నుంచి టీఎస్ఐఐసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రైతులు కూడా 8 సంవత్సరాల క్రితమే భూములను ప్రభుత్వానికి అప్పగించాం. అధికారులు, అప్పటి ప్రభుత్వం నిర్లక్ష్యం వలన పనులు ముందుకు సాగలేదు. వారం రోజుల్లో పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించాను. ఐటీ కారిడార్‌కు మెరుగైన రోడ్డు వేస్తాం. దీంతో స్థానికుల, ఐటీ ఉద్యోగుల కష్టాలు తీరనున్నాయి. ఐటీ కంపెనీలకు మౌళిక సదుపాయలు కల్పిస్తాం.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

సంతోషంగా ఉంది



చాలా సంవత్సరాలుగా రోడ్డు వెడల్పు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అధికారులకు అనేకమార్లు చెప్పినా పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనుల విషయంలో పురోగతి రావడం శుభపరిమాణం. అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేస్తుంది. ఎమ్మెల్యే మల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం అభివృద్ధి చెందుతుంది. ప్రజలంతా ఎమ్మెల్యేకు సహకరించాలి. ఆదిబట్ల ఐటీలో అగ్రగామిగా నిలుస్తుంది.

– లావణ్య, కౌన్సిలర్, ఆదిబట్ల

నీళ్లు రాలే.. బిల్లు మాత్రం వచ్చింది

- నాలుగేళ్లుగా నీటిచుక్క రాకపోయినా రూ.వేలల్లో బిల్లు
- అవాక్కైన వినియోగదారుడు



నల్లా కనెక్షన్ కోసం చెల్లించిన రసీదును చూపుతున్న రాఘవేందర్

తాండూరు టౌన్: నాలుగేళ్ల క్రితం తాగునీటి నల్లా కోసం మున్సిపాలిటీకి ఓ వ్యక్తి దరఖాస్తు చేసుకున్నాడు. రుసుము తీసుకుని కనెక్షన్‌కు అనుమతి ఇచ్చారు. నాలుగేళ్లుగా ఒక్క చుక్క నీళ్లు కూడా సరఫరా కాలేదు. వివరాల్లోకి వెళ్తే.. తాండూరు పట్టణంలోని 24వ వార్డుకు చెందిన రాఘవేందర్ నల్లా కోసం దరఖాస్తు చేసుకున్నాడు. నాలుగేళ్లుగా నల్లాకు నీళ్లే రాలేదు. కానీ ఈ నాలుగేళ్లకు గాను రూ.4,500 చెల్లించాలంటూ పన్ను రసీదుతో మున్సిపల్ సిబ్బంది ఇంటికి రావడంతో అతను బిక్కముఖం వేశాడు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. నీళ్లు రావడం, రాకపోవడంతో మాకు సంబంధం లేదు.. మేము నల్లా కనెక్షన్ కోసం అనుమతి ఇచ్చిన తేదీ నుంచి రుసుము వసూలు చేస్తామని సమాధానమివ్వడంతో అవాక్కయ్యాడు. పలుమార్లు నల్లా కనెక్షన్ ఏర్పాటు చేయాలని విన్నవించుకున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదని రాఘవేందర్ అసహనం వ్యక్తం చేశాడు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ సాహు శ్రీలత, ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ షఫీవుల్లా దృష్టికి తీసుకెళ్లారు. అయితే నల్లా కనెక్షన్ అనుమతి ఇచ్చినరోజు నుంచి బిల్లు కట్టాల్సిందేనని ఆయన కూడా సమాధానం ఇవ్వడం గమనార్హం. నీళ్లే రాని నల్లాకు బిల్లు ఎలా కట్టాలని రాఘవేందర్ వాపోయాడు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరాడు.

నలుగురి అదృశ్యం

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన సప్పిడి కుమార్ వ్యక్తిగత పనుల నిమిత్తం ఈనెల 4న హైదరాబాద్ వెళ్లాడు. 9వ తేదీన వాళ్ల సోదరుడు మహేశ్‌తో కుమార్ ఫోన్లో మాట్లాడాడు. అయితే 10వ తేదీ నుంచి కుమార్ ఫోన్ స్విచ్‌ఆఫ్ వస్తోంది. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు బంధువులు, మిత్రులు, పరిచయస్తులకు ఫోన్లు చేయడంతో పాటు పరిసర ప్రాంతాలన్నీ గాలించారు. అయినప్పటికీ కుమార్ ఆచూకీ దొరకలేదు. కుమార్ అన్న మహేశ్ గురువారం తాండూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తాండూరు ఎస్ఐ శ్రీను తెలిపారు.

కందుకూరు పీఎస్ పరిధిలో..

కందుకూరు: భార్యభర్తలు గొడవపడిన ఘటనలో భార్య, కుమారుడితో పాటు భర్త అదృశ్యమైన సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని నేదునూరుకు చెందిన భార్యభర్తలు బాబయ్య(34), మమత(32) కూలీపనులు చేసుకుని జీవిస్తున్నారు. కాగా ఈనెల 11న రాత్రి ఇంట్లో వారిద్దరు గొడవపడ్డారు. కాగా 12న ఉదయం 6 గంటల సమయంలో భార్య మమత మనస్తాపంతో తన కుమారుడు సాకేత్(9)ను తీసుకుని ఇంటినుంచి వెళ్లి వెళ్లిపోయింది. విషయం తెలుసుకుని వారిని వెతకడానికి అని మరుసటి రోజు ఉదయం వెళ్లిన బాబయ్య ఇప్పటివరకు ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా ముగ్గిరి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు గురువారం కందుకూరు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సైదులు తెలిపారు.

శ్రీశైలంలా ప్రసిద్ధి చెందుతుంది



శివాలయాన్ని పరిశీలిస్తున్న శివకుమార్, సుందర్‌రాజన్

- యాదాద్రి ఆలయ రూపశిల్పి సుందర్‌రాజన్
- శంకరపల్లి మండలం చందిప్పలోని మరకత శివాలయం సందర్శన

శంకర్‌పల్లి: మరకత శివాలయాన్ని కృష్ణ శిలతో పునఃనిర్మిస్తున్నామని టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు శివకుమార్, యాదాద్రి ఆలయ రూపశిల్పి సుందర్‌రాజన్ తెలిపారు. గురువారం శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప గ్రామంలోని శివాలయాన్ని ఆయన సందర్శించడంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయం కొలతలు, లయ విస్తీర్ణం గురించి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. 11వ శతాబ్దంలో చాణక్యులు ప్రతిష్ఠించిన మరకత శివలింగాలు తెలుగు రాష్ట్రాల్లో అరుదుగా ఉంటాయని.. మన ప్రాంతంలో ఇలాంటి విగ్రహం ఉండటం ఎంతో అదృష్టం అన్నారు. శిల్పి సుందర్‌రాజన్ సూచనల మేరకు చందిప్ప మరకత శివాలయాన్ని పునఃనిర్మాణం చేసేందుకు గ్రామస్తులతో చర్చించి ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయానికి నాలుగు మూలల విగ్రహాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. భవిష్యత్‌లో మరకత శివాలయం.. మరో శ్రీశైలంగా ప్రసిద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయల కమిటీ అధ్యక్షుడు సదానందం, సర్పంచ్ స్వప్న, ఎంపీటీసీ దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఆయల కమిటీ సభ్యులు దయాకర్‌రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన నిర్వహించాలి

తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక

కడ్తాల్: జాతీయ స్థాయి జనగణనతో పాటు కులగణన కూడా నిర్వహించాలని తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు రాఘవేందర్ డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనుమంత్‌రావు, మాజీ ఎంపీ కనిమొళి, వివిధ బీసీ సంఘాల, వివిధ పార్టీల బీసీ నాయకుల, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి జనగణనలో కులగణన ఉద్యమానికి రాఘవేందర్ మద్దతు పలికారు. ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

ఇగ్నైట్ ఫెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న శారద

మొయినాబాద్: మొయినాబాద్ మండలం తోలుకట్టలో ఉన్న చేవెళ్ల గురుకుల పాఠశాల విద్యార్థులు ఇగ్నైట్ ఫెస్ట్–2023లో అద్భుత ప్రతిబ కనబర్చారు. ఇటీవల వికారాబాద్ జిల్లాలోని శివారెడ్డిపేట గురుకులంలో ఇటీవల జరిగిన రీజినల్ లెవెల్ ఇగ్నైట్ ఫెస్ట్‌లో భాగంగా కథలు చెప్పడంలో ప్రణీత(ఇంగ్లీష్) ద్వితీయ స్థానం, నందిని(తెలుగు) ద్వితీయ స్థానం సాధించారు. పుస్తక సమీక్షలో జే.పూజ(ఇంగ్లీష్) ప్రథమ స్థానం, స్కిట్ అండ్ డ్రామాలో నిహారిక, స్పందన, వి.అమూల్య, కావేరి, వై.అమూల్య, అర్చన, కె.నందిని, రుచిత, హాసిని, ఇందిరప్రియదర్శిని గ్రూప్ ప్రథమస్థానం, థిమాటిక్ డ్రాయింగ్‌లో రాజేశ్వరి మూడోస్థానం, వై.శృతి మూడోస్థానం, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్‌లో మైత్రి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ ప్రాంతీయ సమన్వయాధికారి శారద, ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.